క్లుప్తంగా

ఘన చరితల చర్చిలివి

చర్చెస్ ఇన్ తెలుగు స్టేట్స్ పుస్తకావిష్కరణ



రోటరీ క్లబ్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: తెలుగు రాష్ట్రాల్లో చరిత్ర కలిగిన చర్చిలకు సంబంధించి వివరాలను తెలిపే విధంగా చర్చస్ ఇన్ తెలుగు స్టేట్స్ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు పుస్తక రచయిత సునాత్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో చర్చెస్ ఇన్ తెలుగు స్టేట్స్ పుస్తకావిష్కరణ నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లో ఘన చరిత్ర కలిగిన చర్చలు ఎన్నో ఉన్నాయని వాటి గురించి భావితరాలకు తెలిసేలా పుస్తకాన్ని రచించడం జరిగిందన్నారు. ఒక్కొక్క చర్చి ప్రాధాన్యాన్ని వివరాలు, ఫోటోలతో ముద్రించినట్టు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 87 చర్చిల పూర్తి వివరాలను ఈ పుస్తకంలో పొందుపరిచామన్నారు. ఆర్కిటెక్ట్ సుధీర్ మాట్లాడుతూ చర్చిల ప్రాముఖ్యాన్ని తెలుసుకుని దాని ఆధారంగా ఫోటోలు సేకరించి పుస్తకాన్ని రూపొందించామన్నారు. శామ్ బిన్నీ, రంజిత్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షులు రిక్కీ గూటం ప్రసంగించారు. సత్యవాణి అధ్యక్షులు జాషువా గూటం, ఆంధ్ర బాప్టిస్ట్ సంఘ కాపరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

ద్వారంపూడి కోసం క్రైస్తవుల ప్రార్థనలు



ఎమ్మెల్యే ద్వారంపూడి కోసం ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ పెద్దలు

కాకినాడ: సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆదివారం స్థానిక లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ షాలివో ప్రార్థనామందిరాన్ని ఆదివారం సందర్శించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పాస్టర్ సీహెచ్ శామ్యూల్ విక్టర్ ఆధ్వర్యంలో అక్కడి క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

ఎన్నికల సిబ్బంది శిక్షణకు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: రానున్న ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణలో ఉండే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు 12, 13 తేదీలలో జరగనున్న శిక్షణ ఏర్పాట్లను సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదివారం పరిశీలించారు. శిక్షణ జరిగే పీఆర్ కళాశాల ప్రాంగణాన్ని అధికారులతో కలిసి సందర్శించిన ఆయన చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఇతర ఎన్నికల అధికారులు ఉన్నారు.

తప్పుడు పోస్టులపై వైఎస్సార్ సీపీ నాయకుల ఫిర్యాదు

కాకినాడ రూరల్: తెలుగుదేశం పార్టీ నుంచి ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన సర్పవరం గ్రామానికి చెందిన నాయకులు కాళ్ల శ్రీను, వాసంశెట్టి పోతురాజులపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేయడంతో వారు ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారితో పాటు సర్పవరం పోలీసు స్టేషన్‌లోను ఫిర్యాదు చేశారు. తమ ఫొటోలను ఉంచి అమ్ముడుపోయిన నాయకులమని శనివారం రాత్రి శెట్టిబలిజ సంఘం వాట్సప్ గ్రూప్‌లో పెట్టారన్నారని వారు పేర్కొన్నారు. ఫొటోలు తప్పుడుగా పెట్టడంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, మా కుటుంబ సభ్యులు మనోవేదనకు గురయ్యారని పరువు తీసేలా వాట్సాప్‌లో తప్పుడుగా పెట్టిన రాయుడు విజయ్‌కుమార్‌పై చర్య తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరారు. అనంతరం కాళ్ల శ్రీను, వాసంశెట్టి పోతురాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలుచేశారని, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నియోజకవర్గ అభివృద్ధి చేయడంతో సంతృప్తి చెంది తాము టీడీపీ నుంచి బయటకు వచ్చి వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. ఓర్వలేక జనసేన, టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానంలో తేల్చుకుంటామన్నారు. అసత్య ప్రచారాలను సర్పవరం ప్రజలు, ముఖ్యంగా శెట్టిబలిజ సంఘం సభ్యులు నమ్మవద్దని వారు కోరారు.

అభివృద్ధి చేశా.. మళ్లీ గెలిపించండి



దుకాణదారును ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 26వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

కాకినాడ: గడచిన ఐదేళ్లలో నగర అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి రానున్న ఎన్నికల్లో తనను మరోసారి గెలిపించాలని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన 26వ డివిజన్ చంద్రిక థియేటర్ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెట్రోలు బంక్ వద్ద ప్రారంభమైన ర్యాలీ నున్నవారి వీధి, గుడిమెట్లవారివీధి, పురంవారివీధి ప్రాంతాల మీదుగా సాగింది. అడుగడుగునా ఆయనకు బ్రహ్మరథం పట్టారు. పూలు చల్లుతూ హారతులిచ్చి స్వాగతం పలికారు. సాధించిన ప్రగతిని ఆయన ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని ద్వారంపూడి కోరారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేద వర్గాలు అందరికీ సంక్షేమ ఫలాలు అందించామన్నారు. అందువల్లే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి మరిన్ని సమస్యలను అడిగి తెలుసుకుని దాదాపు అన్ని సమస్యలూ పరిష్కరించగలిగామన్నారు. అదే కారణంతో మరోసారి గెలిపించాల్సిందిగా ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, సంగాని నందం, కొప్పనాతి బాబి, పంతాడి బ్రహ్మనందం, ధర్మాడి సత్యం, మాజీ కార్పొరేటర్లు వెలమల మల్లేశ్వరరావు, నల్లబెల్లి సుజాత, దాసు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న ద్వారంపూడి మహాలక్ష్మి

ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి ప్రచారం

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సతీమణి మహాలక్ష్మి ఆదివారం భర్తకు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. 40వ డివిజన్ లయన్స్ క్లబ్ నుంచి ప్రారంభించారు. పార్టీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న ఆధ్వర్యంలో స్థానికులు ఆమెకు హారతులు ఇచ్చి స్వాగతించారు. గడచిన ఐదేళ్లలో భర్త చంద్రశేఖరరెడ్డి కాకినాడ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, అందువల్ల ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, ఏపీఐఐసీ డైరెక్టర్ బసవ అశోక్, పెద్ద సంఖ్యలో మహిళా నాయకులు, కార్యకర్తలు ఆమె వెంట ఉన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం



గురజనాపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: ప్రజా సంక్షేమం జరగాలన్నా, గ్రామాల్లో అభివృద్ధి కొనసాగాలన్నా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే సాధ్యమని ఆపార్టీ నాయకుడు పబ్బినీడి పాపారావు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలం గురజనాపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కల్సి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామంలో చేసిన అభివృద్ధి, నవరత్న పథకాల ద్వారా గ్రామస్తులు పొందిన లబ్ధిని వివరిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. ఇంతవరకూ ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్‌ను అంగీకరింప చేసి ఎమ్మెల్యే కన్నబాబు సాల్ట్ భూములు కొనుగోలు చేసి 700 మందికి ఇళ్లస్థలాలు ఇచ్చారని ఓటర్లకు వివరిస్తూ ప్రచారం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కన్నబాబును ఎమ్మెల్యేగాను, పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించి తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను పాపారావు అభ్యర్థించారు. సర్పంచ్ అనసూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కృష్ణమూర్తి, పార్టీ నాయకులు పబ్బినీడి వీరబాబు, మామిడాల గౌతమ్, బొడ్డు అప్పారావు, పాపారావు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: జనసేన-తెలుగుదేశం పార్టీల నుంచి పెద్ద ఎత్తున యువకులు, వివిధ వర్గాల కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 14, 15 డివిజన్ల పరిధిలోని ఏటిమొగ ప్రాంతానికి చెందిన మత్స్యకార యువకులు, మహిళలు రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మత్స్యకార నాయకులు కాటాడి జానికి రామ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరేందుకు ముందుకు వచ్చారు. పేద ప్రజల సంక్షేమానికి, మత్స్యకారుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేస్తున్న కృషికి తామంతా పార్టీలో చేరుతున్నట్టు స్పష్టం చేశారు. పాలెపు రవితో పాటు పెద్ద ఎత్తున ర్యాలీగా యువకులు తరలివచ్చారు. పార్టీ నగర ఉపాధ్యక్షుడు చెక్కా చక్రవర్తి, మాజీ కార్పొరేటర్ భీమరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

26వ డివిజన్‌లో..

స్థానిక 26వ డివిజన్ రామాలయం వద్ద పెద్దఎత్తున యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. మాజీ కార్పొరేటర్ సంగానికి నందం, కొప్పనాతి బాబి ఆధ్వర్యంలో పెమ్మాడి నాని, దండిప్రోలు గంగాధర్, బాబి, దినేష్‌తో పాటు జనసేన-టీడీపీలలో క్రియాశీలకంగా పనిచేస్తున్న నాగరాజుపేట, పరదేశమ్మపేట ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది పార్టీలో చేరారు. వీరందరినీ ఎమ్మెల్యే ద్వారంపూడి అభినందిస్తూ మత్స్యకారుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిందని, వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను మరోసారి గెలిపించుకునేలా తమ ప్రాంతాల్లో మత్స్యకారులు కృషి చేయాలని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి కోరారు.

కొత్త అమావాస్యకు ఆలయాల ముస్తాబు



కొత్త అమావాస్య ఉత్సవాలకు ముస్తాబైన టూటౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయం



భక్తులను ఆకట్టుకుంటున్న పెద్దమార్కెట్‌లోని విద్యుత్ దీపాలంకరణ

బోట్‌క్లబ్: నగరంలో పలు నూకాలమ్మ అమ్మవారి ఆలయాల్లో కొత్త అమావాస్య వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులను ఆకట్టుకొనేలా విద్యుత్ దీపాలంకరణ చేశారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. టూటౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులకు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయంలో పెద్ద జాగారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆలయంలో తెల్లవార్లు జాతర నిర్వహిస్తున్నారు. అమ్మవారి గరగల నృత్యం, బ్యాండు మేళం, కొమ్ముల డాన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 9వ తేదీన ఉగాది సందర్భంగా జాతర మహోత్సవం, రాత్రి సిరిబొమ్మ ఉత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 11న అమ్మవారి బుక్కా సంబరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పెద్దమార్కెట్‌లో ఉన్న నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ సత్యవేణి తెలిపారు. ఆదివారం రాత్రి జాతర మహోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. గరగల నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కాళికాదేవి నృత్యాలు, బ్యాండ్ మేళం, కేరళ వాయిద్య నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా భారీ క్యూలైన్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ తల్లి

వైభవంగా నూకాలమ్మ జాతర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు కాండ్రకోట నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గవరసాని వీరాస్వామి, ఆలయ కార్యనిర్వహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ, ఉత్సవ ప్రత్యేకాధికారి సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో భారీ ఉత్సవాన్ని నిర్వహించారు. జాతర ఉత్సవాన్ని ఆలయ లాంఛనాలతో గ్రామానికి చెందిన గంటా వారి కుటుంబం నుంచి గరగను తీసుకువచ్చి అమ్మవారి జాతరను వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వీరాస్వామి, ఈఓ సూర్యనారాయణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరం అన్నారు. యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ రవికుమార్, ఎస్ఐ వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ వద్ద కోలాటం, గరగల నృత్యం, మ్యూజికల్ నైట్, దేవతామూర్తుల వేషధారణ, కాళీకావేషాలు, భారీ విద్యుత్ అలంకరణల మధ్య మహోత్సవం అంబరాన్నంటింది. పిన్న, పెద్ద తేడా లేకుండా వేల సంఖ్యల్లో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చర్చిలో టీడీపీ ఎన్నికల ప్రచారం!

ఆర్వోకు వైఎస్సార్ సీపీ ఫిర్యాదు

కాకినాడ: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా చర్చిలలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పార్టీ ప్రతినిధి ముమ్మిడి పవన్ ఆధారాలతో ఆర్వోకు ఫిర్యాదు చేశారు. ఆదివారం 10వ డివిజన్, దుమ్ములపేటకు చెందిన మూగు రాజు, గోవ అమ్మోరు ఆధ్వర్యంలో చర్చిలో జరిగిన ప్రచార కార్యక్రమంలో సుమారు 300 మంది హాజరైనట్టు తమ వద్ద స్పష్టమైన సమాచారం ఉందన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి చర్చిలో ప్రచారం చేసిన తెలుగుదేశం పార్టీపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనుమతి లేకుండా సమావేశం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమాడి కొండబాబు ఈ నెల 6వ తేదీన ఎటువంటి అనుమతి లేకుండా టీడీపీ ప్రధాన కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారని వైఎస్సార్ సీపీ తరఫున మరో ఫిర్యాదు అందజేశారు. వార్పురోడ్డు, ఫ్రేజర్‌పేటలో జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు హాజరయ్యారన్నారు. అనుమతి లేకుండా ఇటువంటి సమావేశాలు నిర్వహించిన టీడీపీ అభ్యర్థి వనమాడి కొండబాబుపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో రిటర్నింగ్ అధికారిని కోరారు.

కురంగేశ్వరునికి లక్ష రుద్రాక్ష పూజ



లక్ష రుద్రాక్ష పూజలందుకున్న కురంగేశ్వర స్వామి

తాళ్లరేవు: పవిత్ర మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం పాతకోరంగి బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వర స్వామివారికి లక్ష రుద్రాక్ష పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ నేతృత్వంలో స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు, లక్ష రుద్రాక్ష పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఐడీఏ సభ్యులు

బోట్‌క్లబ్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చునని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక నాగమల్లితోట వద్ద ఉన్న సత్య దంత వైద్యశాల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఆహారంలో మన శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, కార్బోహైడ్రేట్లు, అవసరమైన పోషకాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు స్వరూప్, కార్తిక్, సిరాజ్, చైతన్య, మనోజ్, భవాని పాల్గొన్నారు.

రమణయ్యపేటలో..

కాకినాడ రూరల్: మంచి ఆహార అలవాట్లు, జీవన శైలితోనే ఆరోగ్యం బాగుంటుందని డాక్టరు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టర్ వెంకటరమణ, రవిశంకర్ పట్నాయక్, ఓం నమశివాయ, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ద్వారంపూడి శుభాకాంక్షలు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడ జగన్నాథపురం 26వ డివిజన్‌లో మస్జిద్-ఎ-అజామ్‌లో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. అక్కడి ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఉపవాస దీక్షలు, భక్తిప్రపత్తులతో నిర్వహించే ప్రార్థనలు ఫలించి ముస్లింలు అందరికీ మంచి జరగాలంటూ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. మసీదు అధ్యక్షుడు అత్తర్ దుర్రానీఖాన్, ఉపాధ్యక్షుడు అన్సర్, ముస్లిం ప్రతినిధులు అబ్దుల్ బషీరుద్దీన్, జహంగీర్, రెహ్మాన్‌ఖాన్, ఆలీషా, ఇక్బాల్ ఆలీ, బహద్దూర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేరులో మృతదేహం లభ్యం

పెద్దాపురం: మండలంలోని చంద్రమాంపల్లి ఏలేరు కాలువలో గ్రామంలో పేపర్‌గ్లాసులు ఏరుకునే రమణ (55) అనే అనాథ మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వెలుగుల సురేష్ తెలిపారు. పంచాయతీ అధికారుల సమాచారం మేరకు అధికారులు, గ్రామ సర్పంచ్‌ల సమక్షంలో అనాథ శవాన్ని పంచాయతీ సిబ్బంది ఖననం చేసినట్లు తెలిపారు.

9 మంది జూదరుల అరెస్టు

మండలంలోని కట్టమూరు పుంతలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 9 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ముమ్మరంగా వరి కోతలు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 50 శాతం కోతలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మండలంలో ఈ ఏడాది సుమారు 10154 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ప్రస్తుతం పంట పక్వానికి చేరడంతో కోతలు ప్రారంభించారు. ఎక్కువ మంది రైతులు మెషీన్లతో కోతలు కోసేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అ . ధికారి జోగిరాజు సూచించారు.



కొత్తపల్లిలో మెషీన్‌తో వరికోతలు



ధాన్యాన్ని ట్రాక్టర్‌పై వేస్తున్న మెషీన్



ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న కూలీలు



ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

పెద్దాపురం: పిన్న వయసు నుంచే అన్ని విద్యలు నేర్చుకునేందుకు పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో మే 7వ తేదీ నుంచి నిర్వహించే వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సీ మూర్తి, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి, మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి రాజేష్‌కుమార్ దేవత అన్నారు. స్థానిక వరహాలయ్య పేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరం వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్నారులు అన్ని విద్యలపై దృష్టి సారించి ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలన్నారు. శిబిరం కో-ఆర్డినేటర్ కూనిరెడ్డి అరుణ మాట్లాడుతూ విద్యార్థులు 94417 09187, 79016 97939 నెంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, యూటీఎఫ్ మండల కార్యదర్శి కెనడి తదితరులు పాల్గొన్నారు.